"ప్రేమంటే ఏమిటి?"

లక్ష్మణరావు ఆ ప్రశ్న గురించి చాలా కాలం నించి ఆలోచిస్తున్నాడు. ఎన్ని రోజులు ఆలోచించినా అతని కేమీ జవాబు దొరకలేదు. జవాబు కోసం తను ప్రేమించి తీరాలని ఒకానొక రోజు హోటల్లో కూర్చుని తీవ్రమైన నిర్ణయానికి వచ్చాడు.

లక్ష్మణరావు ఇలా ప్రేమించి తీరా లనుకోవడానికి నాలుగు అతి ముఖ్యమైన కారణా లున్నాయి. అందులో మొదటిది—అతని చదువు పూర్తయింది. రెండోది—అతని కేమీ తోచడం లేదు. మూడోది—జీవితంలో థ్రిల్లుండాలని అనిపించసాగింది. నాలుగోది— రాత్రి పూట ఎక్కువగా కల లొస్తున్నాయి. ఆ కలల్లో బట్టల్లేని ఆడవారే ఎక్కువ.

అందువల్ల లక్ష్మణరావు ప్రేమించి తీరాలనుకున్నాడు. డిగ్రీ చదువు అతనికి ఆ ఉద్యోగం ఇప్పించలేకపోయింది కాని, ఒక కోటా మంత్రిగారి మూడు నిమిషాల రికమెండేషన్, మూడేళ్ళ డిగ్రీ చదువు కంటె చాలా గొప్పదై పోయి అతనికి ఒక జాతీయ కంపెనీలో ఉద్యోగం ఇప్పించింది. చాలా తీరికగా, హుషారుగా ఉండడంకూడా అతను ప్రేమించడానికి అనుకూలంగా ఉంది.

మొదట లక్ష్మణరావు ప్రేమ సుహాసినితో ప్రారంభమైంది. సుహాసిని ఉంటున్న అందాల మేడ ( నిజానికి దాన్ని ఆ ప్రాంతంలో భూత్ బంగళా అంటారు ) అతనుండే రూమ్‌కు ఎదురుగా ఉంది.

సుహాసిని అందంగా ఉంటుందా? కచ్చితంగా ఉంటుంది. ఎందుకంటే, నీడ పట్టున పెరిగింది. కావాలంటే యాపిల్ జ్యూస్ తాగ్గలదు. అనుకుంటే వారం రోజుల్లోనే జలుబు తగ్గించుకో గలదు. లేటెస్ట్ మోడల్ చీరెలు కొనుక్కో గలదు. ఎన్ని నగలున్నా ఒంటిపేట గొలుసు మాత్రమే మెడలో వేసుకోగలదు సింపుల్‌గా. ఎక్కడికైనా కార్లో వెళ్ళ గలదు. ఎంత గొప్ప స్టార్ హోటలైనా భరించ గలదు.

అందువల్ల సుహాసిని అందంగా ఉండకుండా ఎలా ఉంటుంది? ఆమె ఏదో ఇంగ్లీషు నవల అప్పుడప్పుడూ చదువుతూ ఉంటుంది బాల్కనీలో నిలబడి రోడ్డు మీదకు చూస్తూ. ఆమె మొహం మీద సాయంకాలపు నీరెండపడితే చాలాబాగుంటుంది. ఆమె నవ్వితే బాగుంటుంది. నడిస్తే బాగుంటుంది. ఏం చేసినా బాగుంటుంది — చెయ్యకపోయినా బాగుంటుంది.

అంత బాగున్నప్పుడు సుహాసినిని ప్రేమించాలనుకున్నాడు లక్ష్మణరావు.

ప్రేమించాలనుకోవడంలో ఇబ్బందేమీ కనపడలేదు కాని, దాన్ని ఆచరణలో పెట్టడానికే అతను చాలా కష్టపడాల్సొచ్చింది. ఇద్దరి మధ్యా ఉన్న అరవై గజాల దూరం ధ్రువాలమధ్య ఉన్న దూరంలా బాధించింది లక్ష్మణరావుని.

సుహాసినితనని ప్రేమించాలంటే ఏమేం చెయ్యాలి? చాలాసేపు ఆలోచించాడు లక్ష్మణరావు. ఎవరినైనా సలహా అడుగుదా మనుకున్నాడు కాని ప్రేమ వ్యవహారాలు విచిత్రంగా వ్యక్తిగతం కనక సలహా ఎవర్నీ అడక్కూడదని గట్టిగా అనుకున్నాడు.

ప్రేమ ఎలా మొదలు పెట్టాలి?

ఫస్ట్ చూపులు. లక్ష్మణరావు చూడడం మొదలెట్టాడు. అతను కొన్ని వందల చూపుల్ని బాల్కనీలో సాయంత్రం వేళ నిలబడ్డ సుహాసిని వైపు పంపాడు. అట్నించి మూడుసార్లు మాత్రమే రిప్లై వచ్చింది.

సుహాసిని మొదటి చూపుకి అర్థం—వీడెవడు కిటికీకి అతుక్కు పోయాడని.

రెండో చూపుకి అర్థం నన్నే చూస్తున్నట్టున్నాడని.

మూడో చూపుకి అర్థం పోనీలే చూస్తే పోయిందేముందని.


వారం రోజులు గడిచాయి.

లక్ష్మణరావు చూపులకి సమాధానాలు రావడం ఎక్కువైంది.

"హా! ఐయామ్ బ్లెస్డ్" అనుకున్నాడు లక్ష్మణరావు.


సుహాసిని క్యూరియస్‌గా చూడ్డం మొదలెట్టింది. తనని ఒక డలా చూస్తూ ఉన్నా డనుకోవడం ఆమెకి గర్వంగా ఉంది.

"ఫరవాలేదు— తనని ఎక్కడో థియేటర్లోనో, బుక్‌షాప్ దగ్గరో, ఫ్యాన్సీ స్టోర్స్ ముందో, రైల్వే స్టేషన్‌లోనో ఎక్కడ చూసినా గుర్తు పడుతుంది" అనుకున్నాడు లక్ష్మణరావు హుషారుగా.



# "క్షమించాలి... మరో ప్రేమకథ"

పురిపాక శ్రీరామచంద్రమూర్తి




లవ్ టెస్ట్ చేశాడు. అంటే ఏం లేదు. రెండ్రోజులు చూడడం మానేశాడు. సుహాసిని కొంచెం ఫీలైందని మూడో రోజు సాయంత్రం స్పష్టంగా గమనించాడు లక్ష్మణరావు.

చూపుల్నించి లవ్‌ని పైకి తీసుకెళ్ళాలంటే ఏం చేయాలి? ఒక రాత్రంతా నిద్ర పోకుండా మూడు కప్పుల టీ, పాకెట్ సిగరెట్లు తగలేసి ఆలోచించాడు లక్ష్మణరావు.

అతనికి మూడు మార్గాలు తోచాయి సాధారణంగానే.

మొదటిది లవ్ లెటర్. రెండోది కను సైగ. మూడోది సాహసకార్యం.

సుహాసిని అంత అందగిత్తె విషయంలో మొదటి రెండు మార్గాలూ ఒప్పుగా అనిపించలేదు కానీ తమదికూడా ఆర్డినరీ ప్రేమ అయిపోతుందని దిగులు పడ్డాడు. మూడోది బెస్ట్‌గా కనిపించింది లక్ష్మణరావుకి. నిజానికి అదికూడా ఆర్డినరీయే కాని, అది బెస్టని లక్ష్మణరావు అనుకున్నాడు కనక బెస్టయిపోయింది.

అయితే సాహసకార్యం తనేం చెయ్యగలడు? చిన్నతనంలో గోలీలాట తప్ప మరో ఆట ఆడి ఎరగడు. సుహాసిని చూస్తుండగా ఎలెక్ట్రిక్ పోల్ మీంచి కిందికి దూకితే? అప్పు డెప్పుడో గోడ దూకినప్పుడు కాలికి దెబ్బ తగిలి చాలా ఇబ్బంది పెట్టింది. అప్పటినుంచి ఇప్పుడుకూడా సిటీ బస్సు పూర్తిగా ఆగితేనే దిగడం—లేకపోతే ముందు స్టాపులో దిగి వెనక్కి రావడం.

కథలూ కవిత్వాలూ రాసేసి, పాపులర్ అయిపోయి సుహాసినిని ఇంప్రెస్ చెయ్యాలంటే పెన్ను పట్టుకుంటే ముక్క పెగలదు. ఇంటికి ఉత్తరం రాయడానికే ఒక్కో వాక్యాన్ని ఇరవై సార్లు ఆలోచిస్తాడు.

అందువల్ల సాహసకార్యా లంటూ తనేవీ చెయ్యలేడు.

సుహాసిని పై తరగతి పిల్ల కనక తనూ అలాగే కనబడడం— అదొక్కటే తను చేయగలిగిన పని. ఆ తరవాత లక్ష్మణరావు కిందా మీదా పడి సెకండ్ హాండ్ స్కూటర్ ఒకటి కొన్నాడు.

అతను స్కూటర్ కొన్న రోజున సుహాసిని నిజంగా మెచ్చుకోలుగా చూసింది. నిజంగా ఆ రోజే అతనికి యాక్సిడెంటయింది. పెద్దగా గాయాలు తగల్లేదు కానీ, పాంట్ చినిగింది. మోకాలికి దెబ్బ తగిలింది.

రెండు రోజుల చూపులు కార్యక్రమానికి భంగం వచ్చింది.

"పాపం" అనుకుంది సుహాసిని అప్పుడే మొదటిసారి. తనకోసం స్కూటరు కొని దెబ్బలు తగిలించుకున్నాడు 'ప్రోగ్రెసివ్' అని కూడా అనుకుంది. తనకోసం కిటికీముందు అలా ఎంతసేపైనా విసుగు లేకుండా నిలబడ గలడు. 'దట్స్ గుడ్' అనుకుంది.

ఇవి ఆమెకు కొంచెం గర్వాన్నీ సంతోషాన్నీ కలిగించాయి. తనకీ ఏమీ తోచడంలేదు. చదివిన నవలే చదువుకుంటూంది. ముఖ్యంగా బ్రతుకులో థ్రిల్ లేదు. అందువల్ల లక్ష్మణరావుని ప్రేమిద్దాం అనిపించింది చాలా కాజువల్‌గా.

సుహాసిని అలా అనుకోవడానికి కారణం ఆమె ఫ్రెండ్ సుగుణ. సుగుణతో ప్రేమ, ప్రేమని అరిచి అంతా అయ్యాక కనబడకుండా వెళ్ళిన రాజకుమార్ ఉన్నాడు. అప్పట్నుంచి సుహాసినికి ప్రేమమీద నమ్మకం పోయింది. ఆ తర్వాత ఆమె చదివిన పుస్తకాలూ, చూసిన లోకం కూడా ఆమెకి ప్రేమ మీద నమ్మకం పోవడానికి కారణాలు.

అటు తర్వాత కొద్ది రోజుల్లోనే వారిద్దరూ మొదటిసారి కలుసుకున్నారు.

సమయం: కచ్చితంగా పగలే. స్థలం: రైల్వే స్టేషన్.

సుహాసిని ఢిల్లీనుంచి వచ్చే అక్కకోసం ఎదురు చూస్తోంది. లక్ష్మణరావుకి రైల్వే స్టేషన్లో ఏమీ పన్లేదు కానీ సుహాసిని వెళ్తుందని అతనికి తెలిసింది.

సుహాసినిని దూరంగా చూసి అక్కడే నిలబడ్డాడు. ఆమె నల్లచీర కట్టుకుంది. లక్ష్మణరావుకి నల్ల చీరెలంటే దోమలకన్నా ఎక్కువ కోపం. కాని నల్ల చీరెల్ని క్షమించడం ఆ నిమిషం నించి అలవాటు చేసుకున్నాడు.

దగ్గిరగా వచ్చి 'హలో' అన్నా డతను. ఆ రెండు అక్షరాలు అనడానికి అతను తానొక్కడే వో పెద్ద డామ్ కట్టినంత శ్రమ పడ్డాడు.

'హలో' అంది సుహాసిని. ఆశ్చర్య మాశ్చర్యం. సుహాసిని నవ్వుతోంది.

"ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వెహికల్ నడపకూడదు" అంది సుహాసిని. వీణలు మోగినట్టూ, కోకిల కూసినట్టూ, వెన్నెల రాలినట్టూ లక్ష్మణరావుకి ట్రెడిషనల్ ఫీలింగు పుట్టింది.

"ఆ ఏదో ఆలోచన రావడానికి ఒకరు కారణం."

"ఆ కారణం అడగొచ్చా?"

"మీ....రే" అన్నాడు లక్ష్మణరావు.

ప్రేమ ఇంత సింపుల్ సంభాషణలో ఇముడుతుందని వారిద్దరికీ మొదటిసారి తెలిసింది. సుహాసిని తలొంచుకోలేదు. వేలికి చెంగు చుట్టుకోలేదు. కాలి బొటనవేలు రాయలేదు. కాని నవ్వింది చిన్నగా. తర్వాత అడిగింది:

"ఎందుకు పూరికే అలా చూడ్డం కిటికీలోంచి."

"చూడాలనిపిస్తోంది. మరి మీరెందుకుచూడ్డం!

"నేనలా చూస్తుంటే మీకు నవ్వుతుందని."

"అలా వెయిటింగ్ రూమ్‌లో కూర్చుందాం రండి" అన్నాడు లక్ష్మణరావు. తర్వాత వాళ్ళిద్దరూ చాలాసేపు మాటాడుకున్నారు. ఆ సంభాషణద్వారా ఒకర్నొకరు ఆకర్షించు కుంటున్నామని గ్రహించారు ఇద్దరూ.

ట్రైనొచ్చింది. అందులోంచి సుహాసిని అక్క దిగింది. ఆవిడ తెల్ల ఏనుగులా ఉంది. ఆవిడ పిల్లలు పాల కొండల్లా ఉన్నారు.

ఆవిడ ఇత నెవరట అన్నట్లు చూసింది లక్ష్మణరావుని.

సుహాసిని నా బోయ్ ఫ్రెండ్ అనలేదు. వి ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్లేదు.

"లక్ష్మణరావు. మన ఎదురింట్లో ఉంటాడు. ఇక్కడ కనిపిస్తే మాట్లాడుతున్నాను" అంది సుహాసిని.

"ఐ సీ" అం దావిడ.

సుహాసిని ఆమెఅక్కతో కార్లో వెళ్ళాక, స్కూటర్ స్టార్ట్ చేశాడు లక్ష్మణరావు.

తర్వాత అతనూ, సుహాసినీ సినిమాకి వెళ్ళారు. అదో తెలుగు సినిమా. ఇదివరకు సెక్సు దృశ్యాలకోసం యువ జంటలు ఇంగ్లీషు సినిమాలకి వెళ్ళేవారు. కాని లక్ష్మణరావుకి గట్టిగా తెలిసిపోయింది, తెలుగు నిర్మాతలు చాలా సెక్సువల్ మెట్లు ఎక్కేశారని.

థియేటర్లో వాళ్ళిద్దరి భుజాలు రాసుకున్నాయి.

చేతులు నలిగాయి.

ఒక అరమీటరు మేర గాలి వేడెక్కింది.

హఠాత్తుగా సినిమా అయిపోయింది.

స్కూటరెక్కాక అంది సుహాసిని:

"ఏదైనా హోటల్‌కి పోనీ."

లక్ష్మణరావు కొత్తగా కట్టిన స్టార్ హోటల్ ముందు స్కూటరు ఆపాడు! ఇంటికెళ్దాం త్వరగా అంటుందేమోనని అత ననుకున్నాడు. కాని ప్రేమ విషయంలో సుహాసిని గొప్ప పాఠం చెప్పగలదని

అప్పటి కింకా అతనికి తెలియదు.

వాళ్ళిద్దరూ ఉన్న రూమ్ బాగుంది లక్ష్మణ రావుకి. అక్కడి బెడ్ బాగుంది భోజనం బాగుంది, ఎదురుగా సుహాసిని మరీ బాగుంది.

సుహాసినికి అలవాటవడం వల్ల అవేవీ బాగాలేవు కానీ ఏదో కావాలని మాత్రం ఉంది.

అందువల్ల వాళ్ళిద్దరూ ప్రపంచాన్ని చాలాసేపు మరిచిపోయారు.

లక్ష్మణరావు ప్రేమ సఫలీకృతమైంది. అతను పెళ్ళి విషయం ఎత్తలేదు. సుహాసిని అడగలేదు.

"నిన్ను ప్రేమిస్తున్నాను" అన్నాడు లక్ష్మణ రావు డ్రెస్ చేసుకున్నాక. సుహాసిని అప్పటికే డ్రెస్ చేసుకుని బెడ్ మీద కూర్చుంది. లక్ష్మణరావు మాటకి పెద్దగా నవ్వింది సుహాసిని. చాలాసేపు నవ్వి అంది:

"ప్రేమ ఎక్కడ మొదలైనా ఇక్కడే ఆఖరవు తుంది."

"అయితే నువ్వు నన్ను ప్రేమించడం లేదన్న మాట."

రెండు క్షణాల తర్వాత అంది సుహాసిని.

"ప్రేమా దోమా! జస్ట్ ఎట్రాక్షన్. ఇక్కడ దానికి పర్యవసానం రుజువైపోయింది. ప్రేమలాంటి సెంటిమెంట్లు నాకేం లేవు. మనది ప్రేమని కూడా అనుకోను. ఈ ప్రేమద్వారా పెళ్ళి చేసుకోవాలని అనుకోను. జస్ట్ ఫిజికల్ నీడ్. అంతేకదా నిజంకూడా. మగాడికి నీకు ఈ ప్రేమ ఫీలింగ్ ఈ పాటికి పోవాల్సిందేనే? ఇంకా ప్రేమని అరుస్తున్నావు?"

"అంటే మన చూపులూ, సైగలూ, సంభాషణలూ అన్నీ ప్రేమ లేకుండానేనా?"

"ఇది ప్రేమ కాదు. ఆ ముద్దు పేరు పెట్టింది పనీ పాటా లేని రొమాంటిక్ కవులు. ప్రేమ ఈ 'మూడు నిమిషాలకోసం, పెరిగి పెరిగి ఇక్కడే ఆగిపోతుంది" అంది సుహాసిని. అమ్మాయిల్లో అత నంతవరకూ రివల్యూషనరీని చూడలేదు.

"నేను నిన్ను పెళ్ళాడదా మనుకుంటున్నాను" అన్నాడు లక్ష్మణరావు వీరసంగా. కాసేపు నవ్వింది సుహాసిని.

"సోషల్ స్టేటస్ తక్కువ ఉన్నప్పుడు, ఆ స్టేటస్ ఎక్కువగా ఉన్న అమ్మాయిని చేసుకోవా లనుకుంటాడు నీలాంటి వాడు. అది నేచురల్‌గా కనిపించినా దాని వెనకాల స్వార్థం ఉంటుంది. నాకుమాత్రం అలాంటి త్యాగాలేమీ వద్దు. నువ్వంటే ఇష్టపడ్డాను— వచ్చాను. నువ్వుకూడా నన్ను చూడడం, మాట్లాడా లనుకోవడం, చిన్న చిన్న సాహసాలు చెయ్యడం— ఇదంతా ఈ నిమిషాలకోసమే గదా! కాదని నిజాయితీగా చెప్పగలవా?" అంది సుహాసిని సీరియస్‌గా.

లక్ష్మణరావుకి ఆమె మాటల్లో వీణలూ, కోకిలలూ, వెన్నెలలూ కన్పించలేదు కానీ ప్రేమవేదాంతం ఇంత సింపుల్‌గా చెబుతున్నందుకు మాత్రం షాక్ అయ్యాడు.

"మరి రేపు నీ భర్తని కూడా ప్రేమించవా?"

"అదికూడా ఇంతకంటే గొప్పదేం కాదు. ఎంత ఉమెన్స్ లిబ్ అని అరిచినా సంసారంలో వాడిది మాత్రం డామినేటింగ్ రోల్. అది తప్పదనుకుంటాను."

"మరి ఈ ప్రేమా ... ఇదీ..."

"నీ కో రహస్యం చెప్పనా, లక్ష్మణరావ్! ప్రసిద్ధికెక్కిన ప్రేమ కథల్లో ఈ మూడు నిముషాలు అసలు లేనే లేవు. అందుకే అంత విలవిల్లాడిపోయారు" అంది సుహాసిని చాలా మృదువుగా, కళ్ళతో నవ్వుతూ.


లక్ష్మణరావు బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. అతి కష్టం మీద అన్నాడు.

"అయితే నీకు ప్రేమ ప్లేఫుల్ అన్న మాట."

"అంతే మరి. కాకపోతే అందమైన మాటలూ, సెంటిమెంట్లూ, పెళ్ళిళ్ళూ చేర్చి అనవసరమైన రంగులు పూశారు దానికి" అంది సుహాసిని లేచి నిలబడి.

లక్ష్మణరావు చాలా రోజుల వరకూ ఈ షాక్ సించి తేరుకోలేకపోయాడు.

ఆ తర్వాత రెండు నెలలకి సుహాసిని పెళ్ళయిపోయింది. లక్ష్మణరావు దేవదాసు కాలేదు. సుహాసినికి పార్వతి గురించి తెలీదు. అతను హుషారుగా పెళ్ళి కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. సుహాసిని హుషారుగా తాళి కట్టించుకుంది.




● ● ● ●

లక్ష్మణరావుకి ఆలోచన తెగడం లేదు. ప్రేమ సుహాసినికి కనబడ్డట్టే అందరికీ కనబడుతుందా? అందరూ దాన్ని అదేదో ఆటలాగానే చూస్తారా? ప్రేమ గొడవంతా "మూడు నిమిషాల" కోసమేనా?

అతని కెందుకో సుహాసిని మాటల్లో లోప మున్నట్టు అనిపించసాగింది.

లోకంలో అందరూ సుహాసిని లాగానే ఉంటే ప్రేమ కథలు, గొడవలు, త్యాగాలు, సెంటిమెంట్లు ఉండనే ఉండవు కదా అనుకున్నా డతను.

అలాంటి ఆలోచనలో ఉండగానే ఆ రోజు సాయంత్రం అతను స్కూటర్ మీద ఇంటికొస్తూ గాయత్రిని చూశాడు.

అతను చూడడం లేదుగానీ గాయత్రి మాత్రం లక్ష్మణరావుని చాలాకాలంనించి చూస్తోంది.

గాయత్రిని చూడగానే ఏమనిపిస్తుంది?

ఆమె తండ్రి లంచమెరుగని గుమాస్తాయో, లౌక్యం తెలీని బడిపంతులో అయి ఉంటాడనిపిస్తుంది. అందులో మొదటిది నిజమే. ఆమెకో వడిలిపోయిన తోటకూర కాడలాంటి తల్లి ఉంటుందనిపిస్తుంది. అది నిజమే. వాళ్ళ ఇల్లు అద్దె దని, ఆమెకి తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ ఉన్నారనిపిస్తుంది. నిజమే. ఆమె తండ్రి తెలుగు సినిమాల్లో నైనా మంచిని వెదకగల డనిపిస్తుంది. అది నిజమే. వారపత్రికలోని ఏ సీరియలైనా అతనికి నచ్చుతుందనిపిస్తుంది. అదీ నిజమే.

అబద్ధ మేమిటంటే, 'మేం సుఖంగానే ఉన్నాం కదా' అని వాళ్ళనడం. గాయత్రి సినిమా చూస్తున్నప్పుడు, రచయిత్రిమణి చేంతాడు సీరియల్ ప్రేమ కథ చదువుతున్నప్పుడు, తండ్రి తనకి కొత్త చీరె తెచ్చినప్పుడు సంతోషంగా ఉంటుంది.

ఇదంతా లక్ష్మణరావుకి అనిపించింది. దానితో 'పోనీలే ప్రేమిద్దాం' అనుకున్నా డతను.

గాయత్రి లక్ష్మణరావుని చూడగానే "నే నితన్ని ప్రేమిస్తున్నాను" అని కచ్చితంగా అనుకుంది. అలా అనుకోకపోతే ఆమె ముందుకు వెళ్ళలేదు. అలా కాకుండా ఎలా అనుకోవాలో గూడా ఆమెకి తెలీదు.

కాని ఇంకో సంగతి గాయత్రికి తెలుసు. అదేమిటంటే, పెళ్ళి ప్రేమ పెళ్ళి దగ్గరికే దారితీయాలని గాయత్రి కోరుకుంటుంది.

గాయత్రిని ప్రేమిద్దాం అనుకున్నాక లక్ష్మణ రావు మిత్రుడి ఇంటికి వెళ్ళడం మొదలెట్టాడు. గాయత్రి ఇంటికి ఎదురుగా ఉంటుంది ఆ మిత్రుడి ఇల్లు. ఆ మిత్రుడి భార్య చాలా మంచిది. ఎంత మంచిదంటే, లక్ష్మణరావుని చూపించి పిల్లలతో మామయ్య అనిపించదు. రెండోది అతన్ని అన్నయ్యగా రనదు. మూడోది అనవసరంగా సిగ్గుపడదు.

ఇంటికి వెళ్ళగానే కాఫీ ఇచ్చి, చక్కగా మాట్లాడుతుంది. లక్ష్మణరావుకి ఆవిడంటే చాలా గౌరవం.

గాయత్రి వాళ్ళింటి కొస్తుంది. అందువల్ల లక్ష్మణరావు అక్కడే ఉండటం మొదలుపెట్టాడు తీరిక చేసుకుని.

లక్ష్మణరావు రావడం చూశాక గాయత్రికూడా అదే టైముకి అక్కడికి రావడం మొదలుపెట్టింది. తన అఫెక్షన్‌ని తెలియజేస్తుం దనుకున్నాడు లక్ష్మణరావు.

ఓసారి మిత్రుడి భార్య పంపిన కాఫీ తెచ్చింది చాలా సిగ్గుపడుతూ. నీ పేరేమిటంటే గాయత్రి అంది సిగ్గుపడుతూనే. గాయత్రితో సినిమా కథలు, సినిమా హీరోలు, గోరింటాకు ఎలా పెట్టుకోవాలి? మీకేం వంటలు బాగా వచ్చు? వీటి గురించి మాట్లాడాడు లక్ష్మణరావు.

గాయత్రికి కో వారం తర్వాత అతనితోమాట్లాడ్డమంటే సిగ్గూ, భయమూ పోయాయి.

తనొచ్చే సమయానికి వాకిట్లో నిలబడ్డం, తనకే రంగు చీరె ఇష్టమో కనుక్కొని అవే కట్టుకోవడం, అప్పుడప్పుడూ ఇంట్లో చేసిన స్వీట్సు తేవడం గమనించాడు లక్ష్మణరావు.

గాయత్రి తానొకణ్ణి ప్రేమిస్తున్నాననుకోవడం ఒకడు తనని ప్రేమిస్తున్నాడనుకోవడం చాలా అద్భుతంగా కన్పించాయి. గాయత్రికి ప్రేమ దృఢమైపోయింది. లక్ష్మణరావు ప్రేమ వేదాంతం తెలుసుకోడానికి ఎదురు చూస్తున్నాడు.

లక్ష్మణరావుమీది ప్రేమ గాయత్రి చేత చాలా అబద్ధాలు ఆడించి, ఓ చీకటి పడేవేళ ఒకానొక పార్కులో కూర్చోబెట్టింది.

ఇద్దరూ చాలాసేపు ఒకర్నొకరు చూసుకుంటూ కూర్చున్నారు. గాయత్రి అతని కిష్టమైన చీరే కట్టుకుంది. అతని కిష్టమైనట్టే వైట్ బ్లవుజు వేసుకుంది. అతని కిష్టమైనట్టే వదులుగా జడ వేసుకుంది. అతని కిష్టమైన పన్నీ తనకిష్టమైనట్టే చేసింది.

"మీ కోసం చాలా అబద్ధాలు చెప్పాల్సొచ్చింది ఇంట్లో" అంది గాయత్రి నిష్ఠూరంగా. లక్ష్మణరావు నవ్వాడు.

"ఈ పెద్ద వాళ్ళకి తెలీదు కాని, పెళ్ళి కోసం కంటే ప్రేమ కోసం ఎక్కువ అబద్ధాలాడాలి."

"మీ ఉద్యోగం ఎక్కడ?"

లక్ష్మణరావు చెప్పాడు.

"మీ కుటుంబ పరిస్థితులు..."

చెప్పాడు లక్ష్మణరావు.

గాయత్రి తనపరిస్థితి వివరించింది. కంక్లూజన్‌గా మనం ప్రేమించుకుంటున్నాం అంది. లక్ష్మణరావు నవ్వాడు.

"రేపు మా ఇంటికి రండి" అంది గాయత్రి.

"దేనికి?"


"మా వాళ్ళు మిమ్మల్ని చూస్తారు."

"దేనికి చూడ్డం?"

"ఇది మరీ బాగుంది. పెద్దవాళ్ళు మాట్లాడుకుంటే పెళ్ళి చేసుకోవచ్చు."

"పెద్దవాళ్ళు ఒప్పుకోకపోతే?"

"ఒప్పుకోకపోయినా పెళ్ళి చేసుకుందాం. ఆ మాత్రం బతక లేమా?"




"అంటే నీ ప్రేమంతా పెళ్ళి కోసం?"

"మరి ప్రేమించుకుంటే పెళ్ళి చేసుకోక ఏం చేస్తారు?"

"ఇలా ప్రేమించుకుంటూ ఉండడమే..."

"ఎంత కాలం?"

"రెండేళ్ళు" నవ్వుతూ అన్నాడు లక్ష్మణరావు.

"ఆ తరవాత పెళ్ళి చేసుకుంటారా?" అంది గాయత్రి ఆశగా, అమాయకంగా, ఆరాధనగా చూస్తూ.

"పెళ్ళి చేసుకుంటానంటే ప్రేమని పొడిగిస్తూ ఉంటా నన్నమాట" అన్నాడు లక్ష్మణరావు లాజికల్‌గా.

గాయత్రి అర్థం కానట్టు చూసింది. లక్ష్మణరావు మొదటిసారి గాయత్రినిచూసి దిగులు పడ్డాడు.

"ఇక్కడేం తోచదు. సినిమా కెళ్ళి, ఏదైనా హోటలులో భోజనం చేసి ఇంటి కెళదాం" అన్నాడు లక్ష్మణరావు.

"అమ్మో మా వాళ్ళకి తెలిస్తే చంపేస్తారు. అయినా ఆడపిల్ల పెళ్ళి కాకుండా తిరక్కూడదు"

"మరి ఇందాక మీ ఇంటికి రమ్మన్నావుగా!"

"అదీ ఇదీ వేరు."

"మనం ప్రేమించు కుంటున్నాం కనక ఎక్కడైనా తిరగొచ్చు" అన్నాడు లక్ష్మణరావు గాయత్రి చెయ్యి అందుకుంటూ. గాయత్రి సున్నితంగా చేతిని విడిపించుకుంది. లక్ష్మణరావుతో సినిమాకీ, హోటల్‌కీ వెళ్ళాలనుకుంది కాని అప్పటికి వాయిదా వేసింది.

అలా వాళ్ళిద్దరూ నాలుగైదు సార్లు కలుసుకున్నారు. లక్ష్మణరావు ఆ మాటే అనేవాడు. గాయత్రి వాయిదా వేసేది.

"అయితే నీకు నా ప్రేమమీద విశ్వాసం లేదన్న మాట"! పిరమిడ్ అంత పాత మాట అన్నాడు లక్ష్మణరావు ఆ రోజు.

"ఎందుకు లేదూ?" అంది గాయత్రి నొచ్చుకున్నట్టు.

"మరైతే నాతో రావడానికి ఎందు కిష్టం లేదు?"

"వస్తాను" అంది గాయత్రి ఏదో నిశ్చయించుకున్నట్టు. లక్ష్మణరావు ఆమెని ముద్దాడాడు. వాళ్ళిద్దరూ చాలా సేపు కౌగిలిలో ఉండిపోయారు.

ఇంక రాయడానికేం ఉంది?"

మూడ్రోజుల తరవాత సినిమా చూశారు. ఒకానొక హోటల్ గదిలో ఒక రాత్రి పన్నెండున్నర వరకూ ఉన్నారు.

ఆ తరవాత లక్ష్మణరావుకి గాయత్రి మీద ప్రేమ పెరిగిందా. లేదు. అంటే ఆమె మీది ప్రేమని మూడు నిమిషాల రూపంలో రెన్యూ చేసుకునే విషయంలోనే ఆ ఆసక్తి పెరిగింది.

గాయత్రికి మాత్రం అతని మీద చాలా రెట్లు ప్రేమ, ఆరాధన పెరిగాయి.

ఆ అవలక్షణాలు చూశాక గాయత్రి తండ్రి ఆమెకి పెళ్ళి చేసేశాడు. ఆ తరవాత లక్ష్మణరావు ఆ పేట నించి మరో పేటకి మకాం మార్చాడు.

• • •

లక్ష్మణరావు ఆ వీధిలో ఒక మేడ మీది పోర్షన్ సంపాదించాడు. అతని బుర్రలో మాత్రం ప్రేమంటే ఏమిటనేది విప్పేయరాని చిక్కు ప్రశ్నలా తిరుగుతూంది.

తన వరకు ప్రేమంటే ఏమిటో తెలిసిపోయింది అతనికి. మరి స్త్రీ విషయంలో ప్రేమంటే ఏమిటి?

ప్రేమంటే ఏమిటో తనకి తెలీదంది నర్సు. నర్సు అసలు పేరు నరసమ్మ. ఆ పిల్లకి ఇద్దరు కుర్రాళ్ళు బోధ పరిచారు. నరసమ్మ పేరు బాగా లేదు, నర్సు అని పిలిపించుకోవాలని.

అప్పట్నించి నరసమ్మ నర్సు అయిపోయింది. నర్సుకి పద్దెనిమిదేళ్ళుంటాయి. నర్సుకి తండ్రి లేడు. ఆమె తల్లి చాలా ఇళ్ళలో పని చేస్తుంది. అలాగే నర్సుకూడా పని చేస్తుంది వారసత్వంగా.

నీళ్ళు పట్టడం, బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, స్కూలుకి పిల్లల్ని తీసుకెళ్ళి తీసుకు రావడం, మార్కెట్టుకి వెళ్ళడం లాంటి అనేకానేక మైన పనులు చేస్తుందా నర్సు.

మొన్ననే చెప్పులు కొనుక్కుంది.

తలకి నూనె, మొహానికి పౌడర్ రాసుకుంటూంది.

జడ వేసుకుంటూంది శ్రద్ధగా. పూసల దండ మెడలో వేసుకుంటూంది.

కొత్త లంగా మాత్రం కొనుక్కో లేకపోయింది. కొత్త సినిమా చూడలేక పోతూంది. కుర్రాళ్ళ చూపులకి అర్థాలు తెలుసుకోలేక పోతూంది. మొన్న ఆఫీసరుగారి కొడుకు 'మాట, మాట'ని దగ్గరగా పిలిచి చెయ్యి పట్టుకుంటే కోపం వచ్చింది. కాని అతనలా పిలవడంకూడా తనకి ఇష్టమైనట్టే అనుకుంది.

"ఈ రెండు గదులూ ఊడ్వడం, కూజాలో నీళ్ళు పట్టడం, ఈ లుంగీలు ఉతకడం అంతే నువ్వు చెయ్యాల్సిన పనులు" అన్నాడు లక్ష్మణరావు. నర్సు సరే నన్నట్లు తలూపింది గుమ్మం ముందు నిలబడి.

'నర్స్ ఈజ్ హేండ్ సమ్' అనుకున్నాడు లక్ష్మణరావు. నర్సు లక్ష్మణరావుని చూసి ఏమీ అనుకోలేదు.

నర్సు వచ్చాక లక్ష్మణరావు చిన్న చిన్న నియమాలు చాలా పెట్టుకున్నాడు.

సాయంత్రం వేళ రూములో ఉండడం మొదటిది. ఫ్రెండ్స్ నెవరినీ సాధ్యమైనంతవరకు రూముకి రానివ్వక పోవడం రెండోది.

నర్సుకి పూలు తేవడం, పౌడరు కొనివ్వడం, బంగా కొనుక్కోమని డబ్బివ్వడం లాంటి చిన్న చిన్న త్యాగాలుకూడా చేశాడు లక్ష్మణరావు.

ఆ రోజు సాయంత్రం నర్సుని ఆపి అన్నాడు.

"నిన్ను ప్రేమిస్తున్నాను."

మొదటిసారి వ్యాకరణం వింటున్న స్కూలు కుర్రాడి ఫీలింగు ఉంది ఆ పిల్ల మొహంలో.

"ప్రేమంటే ఏమిటి?" అంది నర్సు నవ్వుతూ. ప్రపంచంలోని ప్రేమ పీడితు లందరూ కలిసికూడా ప్రేమంటే ఏమిటో నర్సుకే అర్థం అయ్యేలా చెప్పలే రనుకున్నాడు లక్ష్మణరావు.

"ఏమిటంటే నువ్వంటే నా కిష్టం" అన్నాడు లక్ష్మణరావు.

"ఇష్టమంటే ఏమిటి?"

"ఇష్ట...మంటే... నీతో మాట్లాడాలనీ, నిన్ను చూస్తూండాలనీ అనిపిస్తుంది. నీ కలా ఉండదా?"

"ఏంవుండదు" అని వెళ్ళిపోయింది నర్సు. నర్సుకి ప్రేమలో పడ్డం తెలీదను కున్నాడు లక్ష్మణరావు.

మరో వారం గడిచింది. నర్సు తల్లికి జ్వరం వచ్చింది. అప్పుడు చాలా రాత్రి వేళ మెడికల్ షాపు వాణ్ణి లేపి మందులూ, టిట్బిట్లూ కొనుక్కొచ్చాడు లక్ష్మణరావు.

నర్సుతో ఆ మర్నాడు అన్నాడు.

"నువ్వంటే ఇష్టం లేకపోతే అంత రాత్రివేళ వెళ్ళి మందులు తెచ్చేవాడినా?"

"ఊహూ" అంది నర్సు.

అప్పుడే అతను తను చేసిన చిన్న చిన్న త్యాగాల గురించి కూడా చెప్పాడు. నర్సు నిజంగా సిగ్గుపడుతూ నవ్వింది. అప్పుడు లక్ష్మణరావు ఆమెని దగ్గరగా తీసుకోబోయాడు. నర్సు దూరంగా జరిగింది.

నాల్రోజుల తర్వాత లక్ష్మణరావు ఆమెని దగ్గరికి తీసుకోగలిగాడు.

"నాకు భయమేస్తోంది" అంది నర్సు.

"మనిద్దరికీ ఒకళ్ళంటే ఒకరికి ఇష్టం. అలాంటప్పుడు భయమెందుకు..." అన్నాడు లక్ష్మణరావు మెల్లిగా. మాట మార్చింది నర్సు.

"నాకో గొలుసు తెస్తావా?" అంది. ఆ పిల్ల ఇమిటేషన్ గురించి అడుగుతోందనే భరోసాతో తెస్తా నన్నాడు లక్ష్మణరావు.

వో గంట తర్వాత అన్నాడు లక్ష్మణరావు:

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

"మీరేం చేసుకోరు" అంది నర్సు ధీమాగా.

"ఎందుకు చేసుకో కూడదూ?"

"మీకేం పని నాలాంటిదాన్ని పెళ్ళి చేసుకోవడానికి! బాగా కట్నం తీసుకుని మంచి పిల్లని చేసుకుంటారు గాని" అంది నర్సు.

ఆ మాటతో లక్ష్మణరావుకి ప్రేమ వేదాంతం తెలిసిపోయింది.

ఆ తర్వాత నాల్రోజులకి తనినీ, కూతుర్నీ తిట్టుకొని లక్ష్మణరావు దగ్గర పని మాన్పించింది. అతని దగ్గరే కాదు, కుర్రాడున్న ప్రతి ఇంటి దగ్గరా. అంటే నర్సు ఇప్పుడెక్కడా పని చేయడం లేదు.

● ● ● ●

"నా కీ ప్రేమ వేదాంత మంతా తెలిసిపోయిందోయ్" అన్నాడు లక్ష్మణరావు సిగరెట్టు ముట్టించి మిత్రుడితో. ఆ మిత్రుడు కాఫీ తాగబోతూ ఆగి, వరిస్సపాన్ని చూస్తున్నట్టు లక్ష్మణరావుని చూశాడు.

"నువ్వు ప్రేమజోలి కెందు కెళ్ళావు?"

"ప్రేమ, ప్రేమని గొడవ పెడుతుంటారుకదా ఈ రచయిత్రులూ, రొమాంటిక్ కవులూ. అసలు ప్రేమంటే ఏమిటో తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది"

"ఏం తెలుసుకున్నావు?"

"ముగ్గుర్ని ప్రేమించాను. అందులో మొదటి ఆమె పై తరగతి మనిషి. రెండో ఆమె మధ్యతరగతి. మూడో ఆమె కింది తరగతి."

"ఇదేదో సైంటిస్ట్ పరిశోధనలా ఉంది" అన్నాడా మిత్రుడు పెద్దగా నవ్వి.

"ప్రేమ మీద పరిశోధన చేసి తెలుసుకున్న దేమిటంటే మగాడు ఆడదాన్ని కేవలం శారీరకావసరం కోసమే ప్రేమిస్తాడు."

"బాగుందోయ్ జనరలైజేషన్" అన్నాడా మిత్రుడు హుషారుగా.

"రెండోది నేను శారీరకావసరంకోసం కాకుండా మరోదాని కోసం ప్రేమిస్తున్నానని ఎవడేనా అంటే వాడు నంబర్ వన్ గజదొంగ."

"గుడ్."

"అటు పై తరగతి ఆడదానికీ, ఇటు కింది తరగతి ఆడదానికీ ప్రేమ వెనకాల సెంటిమెంట్లు తక్కువ. ప్రేమ విఫలమైతే ఆత్మహత్యలూ, ఘోరాలు తక్కువ. ఎటొచ్చీ మిడిల్ క్లాస్ మహిళలకే ప్రేమ అవగానే పెళ్ళి, దానితోపాటు సెంటిమెంట్లు, త్యాగాలు, గర్భాలు, మోసపోవడాలు, ఏడుపులు, పెడబొబ్బలు..."

"యు ఆర్ టాకింగ్ బిట్టర్లీ" అన్నాడు మిత్రుడు సీరియస్‌గా.

"ఎంత బిట్టర్‌గా చెబితే అంత నిజం బోధపడుతుంది."

"అయితే నీ పరిశోధన సారాంశ మేమిటి?"

"సింపుల్. ప్రేమంటే భ్రమ మాత్రమే."

"ఆడదీ, మగాడూ ఆ భ్రమ లేకుండా బతకలేరు ఈ ప్రపంచం పుట్టినప్పట్నించి."

"అది భ్రమని తెలుసుకోవాలి. అప్పుడే బాధ ఉండదు. రక్షణ ప్లస్ సాహసం ప్లస్ ఫిజికల్ నీడ్ ఈజిక్వల్‌టు ప్రేమ" అన్నాడు లక్ష్మణరావు చిన్నగా నవ్వి.

ఆ మిత్రుడు సిగరెట్ ముట్టించి వో సారి హాలంతా కలయజూశాడు. ఎవరూ తన్నడానికి రారని అతనికి నమ్మకం కుదిరాక అన్నాడు:

"వాట్స్ నెక్స్ట్?"

"ప్రేమ ఎక్కడ మొదలైనా ఫిజికల్ నీడ్ దగ్గర కొచ్చి ఆగిపోతుంది. అక్కడే పుట్టి, మళ్ళీ అక్కడే ఆగిపోతుంది."

"అయితే ఈ ప్రేమలూ, విరహాలూ అనవసర మంటావు."

"గట్టిగా అంటున్నాను. భావపరంగా ప్రేమని చాలా ఈజీగా తీసుకోవాలి. అప్పుడు ఆడది ఆత్మహత్య చేసుకోదు. మగాడు దేవదాసు కాడు."

"రైట్."

"అదీకాకుండా ఈ ప్రేమని ఆడది మగాడి దగ్గరా, మగాడు ఆడదాని దగ్గరా నిలిపి ఉంచకూడదు. ప్రజల మీదికి మళ్ళించాలి. లేకపోతే రొమాంటిక్ అయిపోయి బూజు పడతారు మనుషులు."

"గో ఆన్" అన్నాడా మిత్రుడు ఆశ్చర్యంగా.

"సుహాసినినిఖిడ్వెంచరస్‌గా ప్రేమించాను. గాయత్రి నన్ను పెళ్ళికోసం ప్రేమించింది. నర్సూ, నేనూ ప్రేమించుకోలేదు కానీ ఇష్టపడ్డాం. ఈ ప్రేమలూ ఫిజికల్ నీడ్ దగ్గర ఆగిపోయాయి."

"తప్పు నీ ప్రేమలో కానీ, వాళ్ళ ప్రేమలో కానీ ఉండాలి."

"అందుకే అసలు ఈ టైపు ప్రేమలన్నీ తప్పే అంటున్నాను."




ఏదో ఆలోచిస్తూ ఆ మిత్రుడు ఏమీ అన్లేదు.

"చాలా జాగ్రత్తగా రోజుల తరబడి ఆలోచించాను కదా! ఈ ప్రేమ గొడవలో చిక్కుకున్న వాడికి ప్రపంచం గుర్తుండదు. పరిసరాలతో పని లేదు. వేరే ఆలోచన అంటూ ఉండదు. ఎందుకంటే లవ్ ఈజ్ ఏన్ ఇల్యూషన్ విచ్ లీడ్స్ అజ టు బెడ్ రూమ్స్. సో ఇట్ మస్ట్ బి అవాయిడెడ్ ఫర్ ది సేక్ ఆఫ్ ది సొసైటీ" అన్నాడు లక్ష్మణరావు ఆవేశంగా లేచి నిలబడి.

చప్పగా చల్లారిన కాఫీని ఒక్క గుక్కలో తాగాడు మిత్రుడు.

ఆ తర్వాత లక్ష్మణరావుకి పిచ్చి పట్టిందని అతనికీ, తనకీ తెలిసిన వాళ్ళందరికీ నమ్మకంగా చెప్పాడా మిత్రుడు.

లక్ష్మణరావు మాత్రం ఎప్పుడూ ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకోలేదు ఆటు తర్వాత. ✱